సాక్షి జయశంకర్ భూపాలపల్లి

మంగళవారం । 15 । జూలై । 2025



కమీషన్ల కక్కుర్తి

అన్నదాతల నుంచి అధిక కమీషన్ వసూలు చేసిన అడ్తిదారులకు, మార్కెట్ అధికారులకు రాష్ట్ర మార్కెటింగ్ శాఖ అధికారులు నోటీసులు జారీ చేశారు. - 8లో▸



కూరగాయల సాగుకు ప్రోత్సాహం

కూరగాయల సాగు విస్తీర్ణం పెంచేందుకు ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా రాయితీ సదుపాయం కల్పించింది. - 8లో▸

గరిష్టం/కనిష్టం
32.7⁰ /26.2⁰

వాతావరణం

జిల్లాలో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండ ఎక్కువగా ఉంటుంది. పలుచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

భూపాలపల్లి రూరల్: స్వయం ఉపాధి, పునరావాసం కోసం జిల్లాలోని దివ్యాంగులు ఈనెల 14నుంచి 31 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమాధికారి మల్లీశ్వరి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సబ్సిడీతో రుణాలు మంజూరుచేయనున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న దరఖాస్తుతో పాటు సంబంధిత ధ్రువపత్రాలను మున్సిపల్ పరిధివారు మున్సిపల్ కార్యాలయంలో, మండలాల వారు ఎంపీడీఓ కార్యాలయాల్లో అందించాలన్నారు. మరిన్ని వివరాలకు 96523 11804 లేదా కలెక్టరేట్‌లోని జిల్లా సంక్షేమ శాఖ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

సీపీఐ జిల్లా కార్యదర్శిగా రాజ్‌కుమార్



భూపాలపల్లి అర్బన్: సీపీఐ జిల్లా కార్యదర్శిగా కొరిమి రాజ్‌కుమార్ ఐదవ సారి ఎన్నికయ్యారు. జిల్లా సహాయ కార్యదర్శులుగా గురుజపెల్లి సుధాకర్‌రెడ్డి, పైళ్ల శాంతికుమార్, 29మంది కౌన్సిల్ మెంబర్స్, 11మంది జిల్లా కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు తెలిపారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

గణపురం: మండలంలోని వివిధ గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సోమవారం ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. రూ.52లక్షల నిధులతో ధర్మరావుపేట గ్రామంలో శివాలయానికి ప్రహరీ, బస్వరాజ్‌పల్లిలో గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనులు, అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులు, గొల్లపల్లి గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



మొగుళ్లపల్లి: మండలంలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై అశోక్ తెలిపారు. మండలంలోని చింతలపల్లి గ్రామ శివారులో సోమవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమతి పత్రాలులేని రెండు ఇసుక ట్రాక్టర్లు మండలకేంద్రం శివారులోని పెద్దవాగు నుంచి ఇతర ప్రాంతాలకు ఇసుక తరలిస్తున్నట్లు గుర్తించారు. ట్రాక్టర్ ఓనర్లు పోతుగల్ గ్రామానికి చెందిన గాజుల పరమేష్, బొల్లెపల్లి రాములు, పాత ఇస్సిపేట గ్రామానికి చెందిన నేర్పటి శ్రీను, డ్రైవర్లపై కేసు నమోదు చేసి ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. మండలంలో ఎవరైనా ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు

పత్తిచేనులోకి దూసుకెళ్లిన కారు




కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం అంతర్రాష్ట్ర వంతెన సమీపంలో మహారాష్ట్రకు చెందిన ఓ కారు అదుపుతప్పి రోడ్డు కిందికి దూసుకెళ్లింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం సాయంత్రం మహారాష్ట్రలోని గడ్చిరోలి నుంచి కాళేశ్వరం వస్తుండగా అంతర్రాష్ట్ర వంతెన దాటిన తర్వాత వేగంగా రావడంతో అదుపుతప్పి జాతీయ రహదారి 353(సీ) నుంచి 150 మీటర్ల దూరంలో పత్తి చేనులోకి వెళ్లింది. ప్రమాదంతో కారు డ్రైవర్ తలకు, మొహంపై స్వల్పగాయాలు అయ్యాయి. డ్రైవర్ అక్కడి నుంచి పరారయ్యాడు. కారులో మహారాష్ట్రలో వాడే దేశీదార్ మద్యం కాటన్లు ఉన్నట్లు సమాచారం. మద్యం బాటిళ్లను స్థానికులు ఎత్తుకెళ్లారని ప్రచారం జరుగుతుంది. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు ఆరా తీస్తున్నారు.

భూభారతి పెండింగ్!

వేలాదిగా వచ్చిన దరఖాస్తులు

- ఆగస్టు 15వరకు పూర్తిచేయాలని ప్రభుత్వ ఆదేశం
- వందల్లోనే సమస్యలు పరిష్కారం
- కొనసాగుతున్న పరిశీలన ప్రక్రియ
- సాదాబైనామాలకు కలగని మోక్షం





భూపాలపల్లి అర్బన్: జిల్లాలో నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తుల పరిశీలన కోసం సంబంధిత అధికారులు సతమతమవుతున్నారు. జిల్లావ్యాప్తంగా భూ సమస్యల పరిష్కారానికి వేలల్లో వినతులు వచ్చాయి. వందల సంఖ్యలోనే పరిష్కారానికి అవకాశం కలుగుతోంది. జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లో సదస్సులు నిర్వహించి భూ సమస్యలపై అర్జీలు స్వీకరించారు. దరఖాస్తులు పెట్టుకున్న రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

సాదాబైనామాలు..

సాదాబైనామాలు, పీఓటీ, ప్రభుత్వ భూములకు సంబంధించి 18వేలకు పైగా అర్జీలు వచ్చాయి. తెల్ల కాగితాలపై జరిగిన భూ క్రయవిక్రయాలపై ప్రభుత్వం ఇంకా నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. జిల్లాలో వేలాది మంది ఈ సమస్య పరిష్కారం కోసం వేచిచూస్తున్నారు. మిగతావి సర్వేనంబర్ మిస్సింగ్, డిజిటల్ సైన్ పెండింగ్‌పై వచ్చాయి. మిగతా దరఖాస్తుల్లో కోర్టు కేసులు, భూ విస్తీర్ణంలో హెచ్చుతగ్గులు, భూమి రకంలో మార్పు, విరాసత్, కుటుంబ సభ్యుల పేర్లలో తప్పులు తదితర సమస్యలపై వచ్చినవి ఉన్నాయి. వీటన్నింటినీ అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ప్రస్తుతం దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ కొనసాగుతోంది. అధికారులు నోటీసులు ఇస్తూ దరఖాస్తుదారుల వద్ద ఉన్న రికార్డులు, ఆధారాలు పరిశీలిస్తున్నారు.

వేల దరఖాస్తులు.. దగ్గర పడుతున్న గడువు

జిల్లావ్యాప్తంగా గత నెల 3వ తేదీ నుంచి 20వ తేదీ వరకు నిర్వహించిన భూ భారతి గ్రామ సదస్సుల ద్వారా జిల్లాలోని 11 మండలాల్లో 48,651 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో ఇప్పటివరకు 200పైచిలుకు మాత్రమే పరిష్కారానికి నోచుకున్నాయి. ఇంకా వేలాది దరఖాస్తులు పెండింగ్‌లోనే ఉన్నాయి. ఆగస్టు 15వ తేదీలోపు భూభారతి ఫిర్యాదులను పరిశీలించి వాటిని పరిష్కరించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. గడువులోపు దరఖాస్తుల పరిశీలన పూర్తయ్యేలా లేదు.

తిరస్కరణకు అధికం

అధికారులు స్వీకరించిన దరఖాస్తుల్లో అత్యధికంగా తిరస్కరణకు గురవుతున్నట్లు తెలిసింది. భూమిని పట్టా చేసేందుకు అధికారులు రైతులకు అనేక చిక్కుముడులు పెడుతున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ముందుగా డిజిటల్ సైన్ పెండింగ్, సక్సెషన్‌పై వచ్చిన దరఖాస్తులను పరిశీలిస్తున్నారు. డీఎస్ చేసేందుకు రైతుల నుంచి పాత పాసు పుస్తకాలు ఉండాలని, రెవెన్యూ రికార్డుల్లోని పహణీల్లో కాస్తు కాలంతో పాటు పట్టాదారు కాలంలో ప్రస్తుతం దరఖాస్తు రైతుల పేర్లు ఉండాలని సూచించారు. సక్సెషన్‌కు సంబంధించి బాధలు అనేకం ఉన్నాయి. రెండు తరాల క్రితం చనిపోయిన పట్టాదారు (రైతు) డెత్ సర్టిఫికెట్, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ ఉండాలనే నిబంధనలు విధించారు. అన్నీ ఉన్నా ఆర్ఎస్ఆర్(సెత్వార్)లో వ్యత్యాసం ఉందని దరఖాస్తులు తిరస్కరిస్తున్నారు.

పరిశీలన వేగవంతం చేస్తాం..



జిల్లాలో భూభారతి ద్వారా వచ్చిన దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేస్తున్నాం. ఇప్పటివరకు మండలాల వారీగా టీమ్‌లు ఏర్పాటు చేశాం. ప్రభుత్వం ఇచ్చిన గడువులోపు పూర్తి చేస్తాం. ఆర్ఎస్ఎస్ సమస్యలను పరిష్కరించేందుకు భూముల వద్దకు వెళ్లి సర్వే నిర్వహించి అనర్హులకు నోటీసులు అందించి వారి పేర్లు తొలగిస్తాం. త్వరలో లైసెన్స్‌డ్ సర్వేయర్లు, జీపీఓలు అందుబాటులోకి రానున్నారు.

– అశోక్‌కుమార్, అదనపు కలెక్టర్

దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు

అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్, ఆర్డీఓ రవి

భూపాలపల్లి: ప్రజావాణిలో ప్రజలు అందజేసిన దరఖాస్తుల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్ తెలిపారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో కలిసి నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 58 మంది ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న అన్ని ప్రజావాణి దరఖాస్తులతో పాటు ప్రజాభవన్, హైదరాబాద్ నుంచి వచ్చిన దరఖాస్తులు పరిష్కరించి పరిష్కార నివేదికలు అందజేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి ఆర్డీఓ రవి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎండుతున్న నారు మడులు

భూపాలపల్లి మండలం జంగేడు శివారులో ఎండిన వరి నారు



మల్హర్ మండలం అన్‌సాన్‌పల్లి శివారులో ఎండిన వరి నారు



జిల్లాలో వర్షాలు సంవృద్ధిగా కురవకపోవడంతో వరి నారు మడులు, కూరగాయల మొలకలు ఆదిలోనే ఎండిపోతున్నాయి. జూన్ నెల చివరలో కురిసిన వర్షాలతో జిల్లాలో రైతులు చెరువుల కింద వరి నార్లు, వర్షాధార పంటల సాగు ప్రారంభించారు. జూలై మొదటివారంలో కొంత మేర వర్షాలు కురవడంతో వరి గింజలు, ఇతర గింజలు మొలకెత్తాయి. వారం రోజులుగా వర్షాలు లేకపోవడంతో భూపాలపల్లి, మల్హర్ మండలాల పరిధిలోని కాశీంపల్లి, జంగేడు, కొంపల్లి, కుంభంపల్లి, అన్‌సాన్‌పల్లి, నాచారం శివారుల్లోని పొలాల్లో వర్షాధార వరి నార్లు, కూరగాయల పంటలు పూర్తిగా ఎండిపోయాయి. దీంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. పంట పొలాలు బీడు భూములుగా దర్శనమిస్తున్నాయి.

– భూపాలపల్లి అర్బన్/మల్హర్



జంగేడు శివారులో బీడుగా మారిన భూములు



మల్హర్ మండలం కుంభంపల్లి గ్రామంలో మొలకలకు నీరు పోస్తున్న రైతులు

కోటి మందిని కోటీశ్వరులను చేస్తాం



మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాల చెక్కును అందజేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు, కలెక్టర్

- మహిళలు ఉపాధి రంగాలను వినియోగించుకోవాలి
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

కాటారం/కాళేశ్వరం: రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. కాటారం, మహాముత్తారం, మహదేవపూర్ మండలాల్లో మంత్రి శ్రీధర్‌బాబు సోమవారం పర్యటించారు. మహదేవపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలల ఆవరణలో విద్యార్థులకు షూ పంపిణీ, వనమహోత్సవం, చిన్న కాళేశ్వరం రైతులతో సమావేశం, కాటారం మండలకేంద్రంలోని బీఎల్ఎం గార్డెన్స్‌లో కాటారం సబ్ డివిజన్ పరిధిలోని స్వయం సహాయక సంఘాలకు రుణాల చెక్కుల పంపిణీ, మహాముత్తారం ఎంపీడీఓ కార్యాలయం నూతన భవనం, రూ.73.50 లక్షలతో నిర్మించిన పీఏసీఎస్ కార్యాలయం భవనం, గోదాం ప్రారంభోత్సవం కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ మహిళలను ఆర్థికాభివృద్ధి దిశగా తీసుకెళ్లడంలో భాగంగా ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు, సోలార్ విద్యుత్ కేంద్రాల ఏర్పాటు, ఆర్టీసీ బస్సులు ఇస్తున్నట్లు తెలిపారు. మహిళలను వ్యాపారవేత్తలుగా తయారు చేస్తామని మంత్రి అన్నారు. మహిళా సంఘాల ద్వారా కోటి రూపాయలతో సోలార్ విద్యుత్ ప్లాంట్స్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మండలానికి వంద మంది మహిళలకు కుట్టు మిషన్ నేర్పించే కార్యక్రమాలు చేపట్టాలని డీఆర్‌డీఏ అధికారులను మంత్రి ఆదేశించారు. ఆత్మహత్య చేసుకున్న ఆరుగురు రైతు కుటుంబాలకు రూ.5లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు.

కమిట్‌మెంట్‌తో పనిచేస్తా..

మంత్రిగా ఒక కమిట్‌మెంట్‌తో పనిచేస్తానని, ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. మహదేవపూర్‌లో 650 మంది విద్యార్థులకు పాఠశాల షూస్, స్పోర్ట్స్ షూస్‌లను పంపిణీ చేశారు. ఖేల్ ఇండియా కార్యక్రమంలో భాగంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం విద్యావ్యవస్థను మెరుగుపరిచేందుకు పెద్దఎత్తున కృషి చేస్తుందని తెలిపారు. మండలంలో ప్రైవేట్ పాఠశాలల నుంచి సుమారు 245 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చేరడం గొప్ప విషయం అని హర్షం వ్యక్తం చేశారు. మంత్రి శ్రీధర్‌బాబు వెంట కలెక్టర్ రాహుల్‌శర్మ, ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాశ్‌రెడ్డి, సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీఆర్‌డీఓ బాలకృష్ణ, డీఈఓ రాజేందర్, తహసీల్దార్లు నాగరాజు, శ్రీనివాస్, ఎంపీడీఓలు, అధికారులు పాల్గొన్నారు.



మహదేవపూర్‌లో మొక్కను నాటుతున్న మంత్రి శ్రీధర్‌బాబు, కలెక్టర్ రాహుల్‌శర్మ

మంత్రి శ్రీధర్‌బాబుకు కృతజ్ఞతలు

ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు ప్రభుత్వం చేస్తున్న కృషికి మహదేవపూర్ ఉన్నత పాఠశాలలో ఐటీ మంత్రి శ్రీధర్ బాబును కలిసి రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కటకం రమేష్ కృతజ్ఞతలు తెలిపారు.

విషాదం.. వివాహేతర సంబంధం!

పచ్చని కాపురాల్లో చిచ్చు పెడుతున్న పరస్త్రీ, పురుష వ్యామోహం

- నగరంలో ఓ వైద్యురాలి అనుమానాస్పద మృతి
- మరో ఘటనలో వ్యక్తి, విద్యార్థిని బలవన్మరణం
- వరంగల్, హనుమకొండ జిల్లాల్లో కలకలం రేపిన ఘటనలు

పచ్చని కాపురాల్లో వివాహేతర సంబంధాలు చిచ్చుపెడుతున్నాయి. పర స్త్రీ, పురుష వ్యామోహంలో పడిన ఆలుమగలు పెళ్లి అనే పవిత్ర బంధానికి విలువ లేకుండా చేస్తున్నారు. జీవితాంతం కలిసి ఉండాల్సిన దంపతులు అర్ధాంతరంగా విడిపోతున్నారు. మరికొందరు నిండు జీవితాన్ని ఫణంగా పెట్టి లోకం విడిచివెళ్తున్నారు. వరంగల్, హనుమకొండ జిల్లాల్లో సోమవారం జరిగిన రెండు ఘటనలు పెళ్లి అనే బంధానికి విలువ లేకుండా చేశాయి. ఓ డాక్టర్.. రీల్స్ చేసే యువతితో ప్రేమాయణం సాగించగా, తట్టుకోలేక వైద్యురాలైన భార్య తనువు చాలించింది. ఓ లారీడ్రైవర్.. 22 ఏళ్ల కాలేజీ యువతితో ప్రేమలో పడి ఇద్దరం కలిసి ఉండలేమనుకుని పురుగుల మందు తాగారు. చికిత్స పొందుతూ చనిపోయారు.

‘రీల్స్ గర్ల్’ మోజులో గుండెవైద్య నిపుణుడు

- భార్యకు శారీరక, మానసిక వేధింపులు..
- దంత వైద్యురాలి మృతిపై కుటుంబ సభ్యుల అనుమానాలు
- పోలీసుల అదుపులో డాక్టర్.. విచారణ
- నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఉద్యోగ సంఘాల నేతల డిమాండ్



ప్రత్యూష (ఫైల్)



డాక్టర్ సృజన్

హసన్‌పర్తి: ఓ డాక్టర్ కుటుంబంలో రీల్స్ గర్ల్ పెట్టిన చిచ్చు ఒకరి ప్రాణం తీసింది. ‘బుట్టబొమ్మ’ ఐడీతో ఇన్‌స్టా, ఫేస్‌బుక్ వేదికగా రీల్స్ చేసే ఆ యువతి పట్ల డాక్టర్ ఆకర్షితుడయ్యాడు. చివరికి ఇరువురు పెళ్లి చేసుకునేదాకా వెళ్లారు. దీంతో ఆ డాక్టర్ కుటుంబంలో గొడవలు ప్రారంభమయ్యాయి. చివరికి డాక్టర్ భార్య, డెంటల్ వైద్యురాలు అనుమానాస్పద మృతి స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు భర్త తరఫున వారు చెబుతుండగా, తన కూతురుని హత్యచేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని మృతురాలి తల్లి పద్మావతి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ ఘటన వరంగల్ నగరంలోని వైద్యవర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది.

అత్తామామలకు చెప్పినప్పటికీ..

డాక్టర్ సృజన్, రీల్స్ గర్ల్ మధ్య సంబంధంపై ఇంట్లో గొడవలు ప్రారంభమయ్యాయి. ఈక్రమంలో డాక్టర్ సృజన్ తన భార్య ప్రత్యూషను శారీరక, మానసిక వేధింపులకు గురిచేయడం ప్రారంభించాడు. ఈ విషయాన్ని ప్రత్యూష తన అత్తామామలు పుణ్యవతి–మధుసూదన్‌కు చెప్పింది. అయినప్పటికీ వారినుంచి ఎలాంటి స్పందన రాలేదు. చివరికి వారి బంధం పెళ్లిదాకా వచ్చింది. ఇంట్లో గొడవలు సాగుతూనే వచ్చాయి. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం ప్రత్యూష నగరంలోని ఎన్ఎస్ఆర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు తల్లి పద్మావతికి సృజన్ ఫోన్ చేశారు. ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు వివరించారు. వెంటనే పద్మావతి ఆస్పత్రికి వచ్చి చూడగా.. విగత జీవిగా కనిపించింది. కాగా, డాక్టర్ సృజన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.

రీల్స్ గర్ల్ ఎంట్రీ ఇలా..



డాక్టర్ సృజన్ నగరంలోని ఓ ప్రముఖ ఆస్పత్రిలో కార్డియాలజీ వైద్యుడు. ఆస్పత్రి ప్రారంభ సమయంలో యూట్యూబర్, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ అయిన ఓ యువతి ప్రమోషన్ వర్క్ కోసం అక్కడికి వచ్చింది. అక్కడున్న వైద్యులతో ముఖాముఖి నిర్వహించింది. ఆ సమయంలో ఆ యువతి పట్ల డాక్టర్ సృజన్ ఆకర్షితుడయ్యాడు. ఇరువురు పరిచయం పెంచుకున్నారు. ఆమె వివిధ భంగిమల్లో చేసే రీల్స్ చూసి మరింత దగ్గరయ్యాడు. ఆ యువతి తన రీల్స్‌లో తాను గుండె ఆపరేషన్‌ను లైవ్‌గా చూసినట్లు పోస్టులు కూడా పెట్టింది. అంటే సృజన్ ఆమెను ఆపరేషన్ థియేటర్‌లోకి కూడా తీసుకెళ్లినట్లు స్పష్టమవుతోంది. ఇటీవల ప్రత్యూష రెండో కాన్పు సమయంలో తల్లిగారింటికి వెళ్లినప్పుడు ఆ యువతి విల్లాకు వచ్చిందని, అంతగా వారి ప్రేమబంధం బలపడిందని స్థానికులు చెబుతున్నారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి : ఉద్యోగ సంఘాల నేతల డిమాండ్

ఎంజీఎం : డాక్టర్ ప్రత్యూష మృతదేహానికి సోమవారం ఎంజీఎం మార్చురీలో పోస్టుమార్టం నిర్వహించారు. ఈసందర్భంగా బంధువులతోపాటు పలువురు ఉద్యోగ సంఘాల నేతలు పెద్దఎత్తున మార్చురీకి తరలివచ్చారు. ప్రత్యూష కుటుంబ సభ్యులను ఓదార్చారు. టీఎన్జీఓస్ ఉద్యోగ సంఘాల నేతలు మాట్లాడుతూ.. ఓ యూట్యూబర్, రీల్స్ చేసే యువతి మాయలో పడి యువ వైద్యురాలు ప్రత్యూష మృతికి కారణమైన డాక్టర్ సృజన్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కాగా, మార్చురీ వద్ద పోలీసులు మృతురాలి తల్లి పద్మావతితో మాట్లాడి వివరాలు సేకరించారు.



ఎంజీఎం మార్చురీ వద్ద ప్రత్యూష తల్లితో మాట్లాడుతున్న పోలీసులు

అతడికి 42.. ఆమెకు 22..

- అతడికి వివాహమైంది.. ఆమె విద్యార్థిని
- కలిసుండలేమని ఇరువురు ఆత్మహత్య

పర్వతగిరి: అతనికి పెళ్లయ్యింది.. ఇద్దరు పిల్లలు. యువతి డిగ్రీ చదువుతుంది. ఇద్దరి మధ్య వివాహేతర సంబంధం.. చివరికి వారిద్దరి ప్రాణం తీసుకుంది. వరంగల్ జిల్లా ఏనుమాముల ఇందిరా కాలనీ ఫేస్–2కు చెందిన వేల్పుగొండ స్వామి(42).. అదే కాలనీకి చెందిన ఎలిశాల గాయత్రి (22) ఇరుగుపొరుగున ఉంటున్నారు. వేల్పుగొండ కుమారస్వామికి భార్య, ఇద్దరు పిల్లలు తొమ్మిదవ తరగతి, ఏడవ తరగతి చదువుతున్నారు. స్వామి లారీడ్రైవర్‌గా కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గాయత్రి డిగ్రీ చదువుతుంది. వీరిద్దరికి మూడేళ్లక్రితం ఏర్పడిన పరిచయం ప్రేమగా మారి వివాహేతర సంబంధానికి దారి తీసింది. స్వామి.. గాయత్రిని వదిలేసి భార్య, పిల్లలతో ఉండాలనే ఆలోచన వచ్చింది. విషయం గాయత్రికి తెలిపినప్పటికీ గాయత్రి అందుకు అంగీకరించలేదు. ‘నీవు నాతోనే ఉండాలి.. మనం ఇద్దరం వివాహం చేసుకొని సంసారం సాగిద్దాం’ అని తెలిపింది. ఈ విషయంలో స్వామి తన భార్యను ఒప్పించాలని ప్రయత్నించినప్పటికీ తాను ఆత్మహత్య చేసుకుంటానని భార్య బెదిరించింది. దీంతో స్వామి ఏమి చేయలేక భార్యను చికిత్స కోసం ఈనెల 2వ తేదీన ఎంజీఎం ఆస్పత్రికి తీసుకెళ్లి అక్కడే వదిలేసి మళ్లీ వస్తానని వెళ్లాడు. రెండు రోజులైనా ఇంటికి రాకపోవడంతో ఈనెల 4వ తేదీన మట్టెవాడ పోలీస్‌స్టేషన్‌లో స్వామిపై మిస్సింగ్ కేసు నమోదైంది. గాయత్రి ఈనెల 2నుంచి కనిపించడం లేదని ఆమె తండ్రి కుమారస్వామి 3వ తేదీన ఏనుమాముల పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు పెట్టాడు. వీరిద్దరు ఆదివారం ఉదయం పర్వతగిరి మండలం అన్నారం షరీఫ్ గ్రామానికి చేరుకుని గడ్డిమందు తాగారు. గమనించిన స్థానికుడు ఎంజీఎం తరలించాడు. చికిత్స పొందుతూ అదే రోజు సాయంత్రం మృతి చెందారు.

ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు

ఎస్పీ కిరణ్ ఖరే

భూపాలపల్లి: అనధికార చిట్‌ఫండ్, అక్రమ ఫైనాన్స్ వ్యాపారం చేస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేసే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ కిరణ్ ఖరే హెచ్చరించారు. సోమవారం ప్రజాదివస్ కార్యక్రమంలో భాగంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 24మంది బాధితుల నుంచి ఎస్పీ వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు బాధితులు అనధికార చిట్‌ఫండ్, అక్రమ ఫైనాన్స్ ఆగడాలపై ఫిర్యాదు చేశారు. ఎస్పీ మాట్లాడుతూ.. అనధికార చిట్‌ఫండ్, అక్రమ ఫైనాన్స్ వ్యాపారం వలన ఇబ్బందులు ఎదుర్కొనే వారు సీసీఎస్, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ మొబైల్ నంబర్‌కు 87126 58108 ఫోన్‌చేసి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.



ఫిర్యాదుదారురాలితో మాట్లాడుతున్న ఎస్పీ

క్లుప్తంగా

సమష్టి కృషితోనే స్నాతకోత్సవం విజయవంతం



కేయూ క్యాంపస్: అన్ని కమిటీల సమష్టి కృషితోనే కాకతీయ యూనివర్సిటీ 23వ స్నాతకోత్సవం విజయవంతమైందని కేయూ వీసీ కె. ప్రతాప్‌రెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం కేయూ సెనేట్‌హాల్‌లో వివిధ కమిటీలు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, ఎన్‌సీసీ కేడెట్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విశ్వవిద్యాలయం ఇమేజ్ పెంపుదలకు కృషి చేయాలన్నారు. రాబోయే రోజుల్లో యూనివర్సిటీలో బోధన, బోధనేతర ఉద్యోగులకు ముఖ గుర్తింపు హాజరును ప్రవేశపెట్టబోతున్నామన్నారు. యూజీలో కూడా ఆన్‌లైన్ మూల్యాంకనం ప్రవేశపెట్టబోతున్నామన్నారు. అనంతరం కాకతీయ యూనివర్సిటీ వరంగల్ యూ ట్యూబ్ చానల్‌ను రిజిస్ట్రార్ వి. రామచంద్రంతో కలిసి ప్రారంభించారు. పరీక్షల నియంత్రణాధికారి కె. రాజేందర్, ఎన్‌సీసీ కమాండెంట్ కల్నల్ సింధిల్ ఎస్. రమాదురై, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు, డీన్లు, విభాగాల అధిపతులు, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన ఓరుగల్లు కళాకారుల ప్రదర్శన



హన్మకొండ కల్చరల్ : రెండు రోజులుగా హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన శ్రీ తనికెళ్ల భరణి రంగస్థల స్వర్ణోత్సవాల్లో భాగంగా తనికెళ్ల భరణి రచనలో వరంగల్‌కు చెందిన ఓరుగల్లు శారదానాట్యమండలి కళాకారులు ప్రదర్శించిన 'చల్‌చల్ గుర్రం' హాస్యనాటిక అలరించింది. ఈ సందర్భంగా సోమవారం జరిగిన కార్యక్రమంలో తనికెళ్ల భరణి.. నాటిక నిర్మాత, నటుడు జేఏస్ శర్మను సన్మానించి మెమెంటో అందజేశారు. నాటిక దర్శకుడిగా సోల్జర్ షఫీ, నటీనటులుగా మహమ్మద్, కోడం సురేందర్, కుసుమ సుధాకర్, గుడివా లహరి నటించారు.

నిట్ వరంగల్‌లో బాంబు కలకలం



కాజీపేట అర్బన్ : నిట్ వరంగల్‌లో బాంబు కలకలం సృష్టించింది. నిట్‌ను మానవ బాంబునై పేలుస్తానంటూ ఓ గుర్తుతెలియని వ్యక్తి నిట్ వరంగల్‌కు చెందిన గ్రూప్‌లో మూడు రోజుల క్రితం ఈమెయిల్ చేసినట్లు విశ్వసనీయ సమాచారం. దీనిపై యాజమాన్యం అప్రమత్తమైంది. శని, ఆదివారాలు సెలవు దినాలుకావడంతో సోమవారం తెరుకుంది. మెయిల్‌ను గమనించి పోలీసులకు సమాచారమిచ్చింది. దీంతో కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్ సుధాకర్‌రెడ్డి.. నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీతో మాట్లాడి క్యాంపస్‌లోని మెయిన్ బిల్డింగ్‌తో పాటు వివిధ ప్రాంతాలను బాంబు స్క్వాడ్‌తో తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో బాంబు లభించకపోవడంతో యాజమాన్యం, విద్యార్థులు ఊపిరి పీల్చుకున్నారు. కాగా, ఈ ఫేక్ ఈమెయిల్‌పై పోలీసులు ఆరా తీస్తున్నట్లు సమాచారం.

రెడ్డి చికెన్ సెంటర్
కిషన్‌పుర, హన్మకొండ
హోల్‌సేల్ రేటు -
బ్రాయిలర్ చికెన్ రేటు -
స్కిన్‌లెస్ చికెన్ రేటు -
Cell: 9989299661

కమీషన్ల కక్కుర్తి..

అన్నదాతల నుంచి అదనపు వసూళ్లు

- ఏడుగురు మార్కెట్ అధికారులు, సిబ్బందికి చార్జీ మెమోలు
- ఏడుగురు అడ్తిదారులకు నోటీసులు





వరంగల్ చౌరస్తా : అన్నదాతలకు ఆరుగాలం కష్టపడి పనిచేయడమే తెలుసు. ఏ పంటకు ఎంత ధర పలుకుతుందో ఏ మాత్రం తెలియదు. ఖరీదుదారు మాట, అడ్తిదారు(కమీషన్ ఏజెంట్లు) సముదాయింపే వాళ్లకు భరోసా. అయితే నమ్ముకున్న వారే అన్నదాతలను అందినకాడికి కమీషన్ల పేరిట దండుకున్నారు. దీనిపై ఫిర్యాదు చేస్తే మార్కెట్ అధికారులు, సిబ్బంది చర్యలు తీసుకోకుండా నిమ్మకునీరెత్తిన్నట్లు వ్యవహరించారు. చివరకు కడుపు మండిన రైతులు మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో దోపిడీ వ్యవహారం వెలుగు చూసింది. ఈ ఘటనపై ఎట్టకేలకు సోమవారం చర్యలకు ఉపక్రమించారు. వివరాలు ఇలా ఉన్నాయి.

4శాతం కమీషన్ కట్..

వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు 2022–23 సంవత్సరంలో 10 మంది రైతులు తమ పంటలను తరలించారు. సరుకులు అమ్మించేందుకు గాను అడ్తిదారులను ఆశ్రయించారు. అడ్తిదారులు వ్యవసాయ ఉత్పత్తులను అమ్మించినందుకుగాను రూ.100కు రూ.2 చొప్పన కమీషన్ తీసుకోవాలి. కానీ ఏడుగురు అడ్తిదారులు రూ.2కు బదులు అదనంగా మరో 2 శాతం అంటే 4శాతం కమీషన్ కట్ చేసుకుని రైతులకు సొమ్ము చెల్లించారు. దీంతో ఆందోళన వ్యక్తం చేసిన రైతులు మార్కెట్ అధికారులకు 14 తక్‌పట్టీ ఆధారాలతో సహా రాతపూర్వకంగా ఫిర్యాదుల చేశారు. కానీ మార్కెట్ అధికారులు, సిబ్బంది ఎవరీ నుంచి స్పందన కనిపించలేదు. దీనిపై విసిగివేసారిన రైతులు ఆయా గ్రామాల్లోని కార్యదర్శులు, ప్రజాప్రతినిధుల సహకారంతో రాష్ట్ర మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులకు వివరాలతో ఫిర్యాదులు చేశారు. ఎట్టకేలకే రెండేళ్ల తర్వాత ఆ శాఖ అధికారులు చర్యలకు ఉపక్రమించారు.

నోటీసులు, చార్జ్ మెమోలు జారీ

రైతుల నుంచి అధిక కమీషన్ వసూలు చేసిన ఏడుగురు అడ్తిదారులకు నోటీసులు జారీ చేశారు. అంతేకాకుండా ఆ ఏడాదిగా కార్యదర్శిగా పనిచేసిన రాహుల్, గ్రేడ్–2 కార్యదర్శి తోట చందర్, బియ్యాబాని(రిటైర్డ్ గ్రేడ్–2 కార్యదర్శి), అసిస్టెంట్ సెక్రటరీ కృష్ణ మీనన్, సూపర్ వైజర్ వెంకన్న నాయక్‌కు రాష్ట్ర మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులు చార్జీమెమోలు జారీ చేశారు. ప్రస్తుతం మార్కెట్‌లో పనిచేస్తున్న సూపర్‌వైజర్ దంతాల గంగాధర్, స్వప్నకు ఏనుమాముల మార్కెట్ కార్యదర్శి గుగులోత్ రెడ్డి చార్జీ మెమోలు జారీ చేశారు. అధిక కమీషన్ల వ్యవహారం మార్కెట్ వర్గాల్లో కలకలం రేపుతోంది. వెలుగుచూసిన ఘటనలు ఒకటి, రెండు కాగా, మార్కెట్ యార్డులో రైతులు పెద్ద ఎత్తున మోసాలకు గురవుతున్నా పట్టించుకునే నాథుడే లేడని తెలంగాణ రైతు సంఘాల నాయకులు విమర్శిస్తున్నారు.

దాతలు చేయూతనందించండి..

- చావు బతుకుల మధ్య సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మానస..
- వైద్య ఖర్చులకు సాయం చేయాలని వేడుకుంటున్న కుటుంబీకులు


కన్నీటి గాథ


ఐసీయూలో చికిత్స పొందుతున్న మానస

కాజీపేట: ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌ను విధి వక్రీంచింది. పెళ్లి అయిన మూడు సంవత్సరాలకే మంచనపడేసింది. ఫలితంగా ఆ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతోంది. విధులు నిర్వర్తిస్తున్న క్రమంలో ఒక్కసారిగా జీవచ్ఛవంలా మారడంతో కుటుంబ సభ్యులతోపాటు బంధుమిత్రులు కన్నీటి పర్యంతమవుతున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. కాజీపేట పట్టణం సోమిడికి చెందిన నాయుడు మానస గౌడ్‌కు మూడు సంవత్సరాల క్రితం ఇదే గ్రామానికి చెందిన బత్తిని వంశీకృష్ణతో వివాహం జరిగింది. ఇద్దరూ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ క్రమంలో ఇటీవల స్వల్ప అస్వస్థతగా ఉందని మానస చెప్పగా కుటుంబీకులు హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లగా పరీక్షలు నిర్వహించారు. మూత్ర పిండాలు, శ్వాసకోశతో పాటు అవయవాలు దెబ్బతిన్నట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ వ్యాధుల చికిత్సకు దాదాపు రూ.16 లక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు స్పష్టం చేశారు. దీంతో కుటుంబ సభ్యులు అప్పు చేసి రూ.10 లక్షల వరకు ఖర్చు చేశారు. మిగతా డబ్బులు ఎంతకూ సమకూరడం లేదు. దీంతో చేతిలో చిల్లిగవ్వ లేకపోవడంతో ఆస్పత్రికి తీసుకెళ్లే మార్గం లేక మానస గౌడ్ చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతోంది. దీనిపై మనసున్న మాహారాజులు స్పందించి ముందుకొచ్చి మానస వైద్యానికయ్యే ఖర్చు అందించాలని కుటుంబ సభ్యులు చేతులెత్తి వేడుకుంటున్నారు. జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు స్పందించి ఉచితంగా వైద్య చికిత్స లభించేలా చూడాలని వేడుకుంటున్నారు.

దాతలు 99666 68666 నంబర్‌కు ఫోన్ పే (నాయుడు మనోజ్‌కుమార్) ద్వారా ఆర్థిక సాయం చేసి మానసను బతికించాలని వారు కోరుతున్నారు.

మావోయిస్టులకు వ్యతిరేకంగా కరపత్రాలు




వాజేడు: జగన్నాథపురం జంక్షన్‌లో గోడకు అంటించిన కరపత్రాలు, కేశవాపురంలో గొత్తికోయగూడెంలో..

వెంకటాపురం(ఎం)/వాజేడు/వెంకటాపురం(కె)/మంగపేట/గోవిందరావుపేట: మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలవాలని కోరుతూ మావోయిస్టు ఆత్మ పరిరక్షణ ప్రజాప్రంట్ పేరిట జిల్లాలోని పలు మండలాల్లో సోమవారం కరపత్రాలు వెలిశాయి. కాలం చెల్లిన సిద్ధాంతాలను వీడి ప్రజల జీవన విధానంలో పాత్రులు కావాలని పోస్టర్లలో పేర్కొన్నారు. ఈ మేరకు వెంకటాపురం(ఎం) మండల పరిధిలోని బండ్ల పహాడ్, తొర్రి చింతలపాడు, ఊట్ల, చాకలిరేవు గొత్తికోయ గూడెంలలో గోడలపై పోస్టర్లను అంటించారు. వాజేడు మండల పరిధిలోని జగన్నాథపురం జంక్షన్, ధర్మపురం, తదితర గ్రామాల్లో కరపత్రాలు అంటించారు. వెంకటాపురం(కె)మండల పరిధిలోని చొక్కాల గ్రామ సమీపంలో కరపత్రాలు వెలిశాయి. మంగపేట మండల పరిధిలోని దోమెడ పంచాయతీ పరిధిలోని పాలాయిగూడెం, తిమ్మారం, రామచంద్రునిపేట గ్రామాల మధ్య, అటవీ ప్రాంతంలోని రాళ్లగుంపు, బ్రాహ్మణపల్లి సమీపంలోని కేశవాపురంతో పాటు గొత్తికోయగూడేల్లోని గుడిసెల గోడలు, గోవిందరావుపేట మండలంలోని గొత్తికోయ గుంపులలో మావోయిస్టులకు వ్యతిరేకంగా కరపత్రాలు వెలిశాయి.

చాకలి ఐలమ్మ మునిమనువడి మృతి


సంపత్ (ఫైల్)

పాలకుర్తి టౌన్: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ ముని మనువడు చిట్యాల సంపత్(44) ఆదివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. సంపత్ మృదేహానికి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, రజక వృత్తిదారులు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏదునూరి మదార్ సోమవారం పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో ఐలమ్మ కుటుంబ సభ్యులు మంజుల, సమ్మయ్య, సంధ్యారాణి, అంజమ్మ, యాకయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్, మాజీ ఎంపీపీ నల్లా నాగిరెడ్డి పాల్గొన్నారు.

జవాన్ అదృశ్యం మిస్టరీ వీడేనా?

- నేను చనిపోతున్నా.. నాకోసం వెతకొద్దని బంధువుకు వీడియో కాల్
- మూడు రోజులుగా శ్రీశైలం డ్యాం పరిసరాల్లో గాలింపు
- ఇప్పటి వరకూ లభించని ఆచూకీ
- ఆందోళనలో బంధువులు, గ్రామస్తులు
- అనారోగ్యంతో మంచం పట్టిన జవాన్ భార్య సరిత


ఆర్మీ జవాన్ నవీన్

మరిపెడ రూరల్: ఇటీవల ఇంటికి వచ్చిన ఓ ఆర్మీ జవాన్ నాలుగు రోజులుగా కనిపించకుండా పోవడం మిస్టరీగా మారింది. అతడు ప్రయాణించిన కారు శ్రీశైలం డ్యాం వద్ద లభ్యమైంది. అయితే అతడి ఆచూకీ మాత్రం లభించకపోవడంతో బంధువులు, గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం గిరిపురం జీపీ పరిధి పూసల తండాకు చెందిన మూడు నవీన్ (28) ఢిల్లీలో ఆర్మీ జవాన్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఇటీవల స్వగ్రామం వచ్చి తన భార్యకు అనారోగ్యంతో ఉండడంతో కారులో హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో ఈ నెల 11 నుంచి అక్కడి నుంచి కనిపించకుండా పోయాడు. దీంతో బంధువులు ఆరా తీయగా అతడు ప్రయాణించి కారు శ్రీశైలం డ్యాం సమీపంలో లభించగా, అందులో నవీన్ సెల్ ఫోన్, ఖాళీ పురుగుల మందు డబ్బా, ఐడీ కార్డులు ఉన్నాయి.

బంధువుకు వీడియో కాల్..

ఆర్మీ జవాన్ నవీన్ 11వ తేదీన ఏడుస్తూ బంధువుకు వీడియో కాల్ చేశాడు. తాను పురుగుల మందు తాగి చనిపోతున్నానని, తనకోసం వెతకొద్దని ఏడ్చినట్లు తెలుస్తోంది. అదేవిధంగా నా భార్యకు తల్లిదండ్రులు లేరని, ఆమెను, తన పిల్లలను మంచిగా చూసుకోవాలని కన్నీటి పర్యంతమైనట్లు తెలుస్తోంది. కారును డ్యాం సమీపంలో నిలిపి తాళం వైపర్ వద్ద ఉంచుతున్నట్లు చెప్పాడని బంధువులు తెలిపారు. అనంతరం ఫోన్ స్విచ్ఛాఫ్ అయినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న బంధువులు కారు వద్దకు చేరుకుని గాలింపు చేపట్టారు. కర్నూల్ జిల్లా అమ్రాబాద్‌లోని పీఎస్‌లో ఈ విషయంపై ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అక్కడి పోలీసులు గాలింపు చర్యలు చేపట్టినా ఎలాంటి పురోగతి లభించకపోవడంతో కుటుంబీకులు, గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నవీన్ భార్య సరిత అనారోగ్యం కారణంగా మంచం పట్టింది. కాగా, నవీన్‌కు 2023లో దంతాలపల్లి మండలానికి చెందిన సరితతో వివాహం జరగగా రెండేళ్ల కుమార్తె, రెండు నెలల కుమారుడు ఉన్నారు. నవీన్ అదృశ్యం కావడానికి కారణాలు మాత్రం తెలియరాలేదు.

యూరియా కోసం ఆధార్ కార్డుల క్యూ..


యూరియా కోసం పీఏసీఎస్ ఎదుట ఆధార్ కార్డుల లైన్ పెట్టిన రైతులు

కొత్తగూడ: యూరియా కోసం మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం పొగుళ్లపల్లిలోని పీఏసీఎస్ కార్యాలయం ఎదుట రైతులు తమ ఆధార్ కార్డులను లైన్‌లో పెట్టి వేచి ఉన్నారు. యూరియా కొరత ఉన్నట్లు వస్తున్న వార్తల నేపథ్యంలో రైతులు ఎగబడుతున్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్..

- రూ.1.60 లక్షల విలువైన ఎలక్ట్రానిక్ వస్తువులు దగ్ధం
- ఘన్‌పూర్‌లో ఘటన


దగ్ధమైన సీసీ కెమెరా

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో మహాలక్ష్మి బేకరి వద్ద ఇళ్ల పైనుంచి వెళ్తున్న 33 కేవీ లైన్ కారణంగా షార్ట్ సర్క్యూట్ జరిగింది. ఈ ప్రమాదంలో మూడు ఇళ్లలో రూ.1.60లక్షల విలువైన ఎలక్ట్రానిక్ వస్తువులు దగ్ధమయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. మెడ్‌ప్లస్ సమీపాన పలు ఇళ్ల మీదుగా 33 కేవీ విద్యుత్ లైన్ వెళ్తోంది. ఈ క్రమంలో ఆదివారం రాత్రి ఆ లైన్‌పై కాకు(పక్షులు)లు వాలడంతో ప్రమాదవశాత్తు మూడు ఇళ్లలో షార్ట్ సర్క్యూట్ అయింది. దీంతో పి.సుగుణ ఇంటిలో రూ.70వేల విలువైన స్మార్ట్ టీవీ, రూ.30వేల విలువైన సీసీ కెమెరాలు, రూ.30వేల విలువైన ఫ్రిడ్జ్‌తో పాటు వైరింగ్, లైట్లు, స్విచ్‌లు దగ్ధమయ్యాయి. అదేవిధంగా బాలాజీ క్లాత్ స్టోర్స్ నిర్వాహకుల ఇంటిలో సర్వీస్ వైరు కాలిపోగా, సారంగానికి చెందిన రవళి కంగన్‌హాల్‌లో రూ.20వేల విలువైన టీవీ దగ్ధమైంది. కాగా, మే 20న 33 కేవీ వైరుపై పిడుగుపాటుతో అదే ఏరియాకు చెందిన కుసుమ రమేశ్ ఇంటిలో రూ.2లక్షల విలువైన ఎలక్ట్రానిక్ దగ్ధమయ్యాయి. కాలనీలో పలు ఇళ్లపై నుంచి 33 కేవీ విద్యుత్ లైన్ ప్రమాదకరంగా ఉందని, పలుమార్లు విద్యుత్ ప్రమాదాలు జరిగాయని కాలనీవాసులు గతంలో విద్యుత్‌శాఖ డీఈకి విన్నవించినా పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు పేర్కొన్నారు. ఇప్పటికైనా స్పందించి ఇళ్ల మీదుగా వెళ్తున్న 33కేవీ విద్యుత్ లైన్‌ను మార్చి సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

కూరగాయల సాగుకు ప్రోత్సాహం


పందిరి విధానంలో సాగు చేస్తున్న కూరగాయలు


క్యాబేజీ తోట

- వందశాతం రాయితీపై నారు
- ఒక రైతుకు 5 ఎకరాలు పరిమితి

హన్మకొండ: రాయితీపై నారు అందిస్తూ ప్రభుత్వం కూరగాయల సాగును ప్రోత్సహిస్తోంది. ఒక్కో రైతుకు ఐదెకరాల వరకు.. వందశాతం రాయితీపై నారును సరఫరా చేస్తోంది. ఉద్యాన శాఖ ద్వారా కూరగాయల సాగు విస్తీర్ణం పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా రాయితీ సదుపాయం కల్పించింది. వందశాతం రాయితీపై టమాట, వంగ, పచ్చి మిర్చి, క్యాబేజీ, క్యాలీఫ్లవర్ నారును సరఫరా చేస్తోంది. సిద్దిపేట జిల్లా ములుగు సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో రైతులు సూచించిన రకం అందించేందుకు సిద్ధంగా ఉన్నారు. దీనికిగాను రైతులు 30 రోజుల ముందుగా విత్తన రకం, పట్టాదారు పాస్ బుక్, ఆధార్, బ్యాంకు ఖాతా పాస్ బుక్ జిరాక్స్ ప్రతులను జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ శాఖ కార్యాలయంలో అందించాలి.

శాశ్వత పందిర్ల నిర్మాణానికి..

శాశ్వత పందిర్ల నిర్మాణం, కూరగాయల సాగుకు ప్రభుత్వం రాయితీ అందిస్తోంది. అర ఎకరానికి రూ.50 వేల చొప్పున రెండున్నర ఎకరాలకు వరకు రాయితీ అందిస్తోంది. మల్చింగ్ పద్ధతిలో కూరగాయల సాగును ప్రోత్సహించేందుకు రాయితీ అందిస్తోంది. కలుపు సమస్యను అధిగమించడానికి, ఎరువుల యాజమాన్యం, తక్కువ పెట్టుబడితో నాణ్యమైన దిగుబడి సాధించడానికి మల్చింగ్ పద్ధతి ఉపయోగపడుతుంది. ఈపద్ధతిలో సాగు ఎకరాకు రూ.8 వేల చొప్పున 5 ఎకరాల వరకు రాయితీ అందిస్తోంది.

అధిక దిగుబడి ఇచ్చేలా..

ప్రథమ శ్రేణి ప్రదర్శన క్షేత్రం ద్వారా కూరగాయల (వంగ) సాగు వైపు రైతులను ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. భూమి నుంచి సంక్రమించే వివిధ రకాల తెగుళ్లను, చౌడు నేలలను తట్టుకునేలా, అధిక దిగుబడి, ఎక్కువ కాలం దిగుబడి ఇచ్చేలా వంగలో అంటు మొక్కలను ప్రభుత్వం రాయితీపై సరఫరా చేస్తోంది. దీనికి ప్రభుత్వం ఎకరానికి రూ.30 వేల వరకు రాయితీ ఇస్తోంది. ట్రెల్లిసింగ్ విధానంలో టమాట, ఇతర కూరగాయల పంటలను సాగు చేసేందుకు ప్రభుత్వం ఎకరానికి రూ.10 వేలు రాయితీ అందిస్తోంది. అంతేకాకుండా సూక్ష్మ సేద్యానికి రాయితీని సమకూరుస్తోంది. బిందు సేద్యానికి బీసీ, సన్నకారు, చిన్నకారు రైతులకు 90 శాతం, ఎస్సీ, ఎస్టీ రైతులకు వందశాతం, ఇతరులకు 80 శాతం రాయితీని, తుంపర్ల సేద్యానికి అన్ని కేటగిరీల రైతులకు 75 శాతం రాయితీపై పరికారులు అందిస్తున్నారు.

ఉద్యాన అధికారులను సంప్రదించాలి



రాష్ట్ర ప్రభుత్వం కూరగాయల సాగుకు అందిస్తున్న రాయితీని రైతులు సద్వినియోగం చేసుకోవాలి. కూరగాయల సాగు విస్తీర్ణాన్ని పెంచాలి. కూరగాయలకు భారీ డిమాండ్ ఉంది. కూరగాయల సాగు లాభదాయకం. రైతులు కూరగాయల నారు, ఇతర పద్ధతిలో సాగు కోసం రాయితీ పొందేందుకు అందుబాటులో ఉన్న ఉద్యాన అధికారులను సంప్రదించాలి.

– శ్రీనివాస్‌రావు, ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి, వరంగల్

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

■ సిరి అసోసియేట్స్: హౌస్, మార్టిగేజ్, పర్సనల్, ఓపెన్ ప్లాట్స్, రేకుల & గూన పెంకుటిల్లులపై రుణాలు ఇప్పించబడును. సెల్: 9666142226. [SCA25005831]

BUSINESS OFFER

■ అధిక ఆదాయం కోసం ఎదురు చూస్తున్నారా!మీసొంత ఇంటర్నేషనల్ క్యాపిటల్ మార్కెట్ మీట్రేడింగ్ అకౌంట్లో సంపాదించండి. ప్రాఫిట్ షేరింగ్ ఫిక్స్‌డ్ రిటర్న్ సేఫ్ & సెక్యూర్. ఫోన్: 6301859174 [SCA25006279]

WANTED

■ WGL విష్ణు లాడ్జిలో మేనేజర్స్‌గా పనిచేయుటకు రిటైర్డ్ ఉద్యోగులు Age 50 సం॥పైన వారు కావలెను. జీ. 8 వేలు 12 hrs. డ్యూటీ. 9391864657 [SCA25006289]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/- రూ॥ అదనపు లైను 60/- రూ॥ మాత్రమే 5% GST అదనము

■ Lab Technicians (Exp), Pharmacy Boys (Exp), Administrative Officer, Computer Operator & Supervisors. Cont: Guardian Hospital, WGL. 2PM. [WA-537]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

వరంగల్	9705748198
నర్సంపేట	9553955722
జనగామ	9951602871
మహబూబాబాద్	9010144453
పరకాల	9010299096
జయశంకర్ భూపాలపల్లి	9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

స్విమ్మింగ్‌పూల్‌కు సెలవు

- రూ.40 లక్షలతో మరమ్మతులు
- నెల రోజులు నోఎంట్రీ


స్విమ్మింగ్‌పూల్‌లోని నీటిని తోడుతున్న మోటార్లు

వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండ బాల సముద్రంలో కొనసాగుతున్న స్విమ్మింగ్ పూల్‌కు నెలరోజులు సెలవులొచ్చాయి. రెండు నెలల క్రితం వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అయితే వేసవిలో స్విమ్మింగ్‌పూల్‌కు రద్దీ ఉన్న నేపథ్యంలో పనులు చేపట్టకుండా నిలిపివేశారు. ఈ క్రమంలో వర్షాకాలం ప్రారంభం, విద్యా సంస్థలు తెరుచుకోవడంతో స్విమ్మింగ్ పూల్‌కు వచ్చే వారి సంఖ్య తగ్గింది. దీంతో వారం క్రితం స్విమ్మింగ్ పూల్ అభివృద్ధి పనులు ప్రారంభించారు. రోజుకు ఆరు గంటలకు పైగా స్విమ్మింగ్ పూల్‌లోని నీరు తోడుతున్నారు. సుమారు రూ.30 లక్షలతో పనులు చేపట్టారు. పూల్ లోపల టైల్స్, వాష్‌రూమ్స్, పూల్‌కు సరిపడా విద్యుత్ ఉత్పత్తి కోసం 10కిలో వాట్స్ సోలార్ ప్లాంట్, పోటీలు జరిగినప్పుడు వీక్షించేందుకు షెడ్డు నిర్మాణం తదితర పనులు చేస్తున్నారు.

యుద్ధప్రాతిపదికన పనులు



క్రీడాకారులకు మెరుగైన వసతులు కల్పించాలని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి చొరవతో స్విమ్మింగ్ పూల్ అభివృద్ధి పనులు చేపట్టాం. నెల రోజుల్లో పూర్తి చేసి స్విమ్మర్లకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు పనులు యుద్ధప్రాతిపదికన చేస్తున్నాం.


– గుగులోత్ అశోక్‌కుమార్, డీవైఎస్ఓ, హనుమకొండ

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య


సంతోశ్‌యాదవ్ (ఫైల్)

ఖిలా వరంగల్: అనారోగ్య సమస్యలతో మనస్తాపం చెందిన ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం .. ఖిలా వరంగల్ మధ్యకోట యాదవవాడకు చెందిన వేల్పుల సంతోశ్ యాదవ్(56) వ్యవసాయ మార్కెట్‌లో వ్యాపారం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో ఇటీవల యూరిక్ యాసిడ్ లెవల్ పెరగడంతో అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆదివారం ఈ సమస్య ఎక్కువ కావడంతో మనస్తాపానికి గురయ్యాడు. సోమవారం తెల్లవారుజామున ఇంటి ప్రాంగణంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఉదయం కుటుంబీకులు గమనించి మిల్స్‌కాలనీ పోలీసులకు సమాచారం అందజేయగా వారు ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి భార్య అరుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రశ్నించినందుకే మావోయిస్టులను చంపుతారా?


మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు

- పోరాటాలతోనే సమస్యల పరిష్కారం
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

భూపాలపల్లి అర్బన్: మానవ సమాజం ఉన్నంత వరకూ కమ్యూనిజం ఉంటుందని, కేంద్ర ప్రభుత్వ విధానాలను ప్రశ్నించినందుకే మావోయిస్టులను చంపుతారా అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రశ్నించారు. సోమవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో పార్టీ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన భారీ బహిరంగ సభకు పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావుతో కలిసి సాంబశివరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అంతకుముందు జిల్లా కేంద్రంలోని కేటీకే 5వ గని మలుపు నుంచి అంబేడ్కర్ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ.. కమ్యూనిస్టు పార్టీ ప్రపంచంలో అతిపెద్దన్నారు. ఏ దేశంలోనైనా కమ్యూనిస్టులు ఉంటారని, ఇతర బూర్జువా పార్టీలు వారి ప్రాంతాలకు పరిమితమవుతారన్నారు. ఎప్పటికీ పేదల పక్షాన నిలబడేది ఎర్రజెండా పార్టీ అన్నారు. 2026 మార్చి వరకు మావోయిస్టులను అంతం చేస్తామని అమిత్ షా చెప్పడం దుర్మార్గమన్నారు. ఒక కమ్యూనిస్టు చనిపోతే 100 మంది జన్మిస్తారని, కమ్యూనిస్టులకు మరణం లేదన్నారు. దోపిడీ ఉన్నంత వరకూ కమ్యూనిజం ఉంటుందన్నారు. పోరాటాలతోనే సమస్యల పరిష్కారం సాధ్యమన్నారు. జిల్లాలో అనేక సింగరేణి కార్మికుల సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించే దిశగా ప్రయత్నం చేస్తామన్నారు. పట్టణంలోని గుడిసె వాసులకు పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సభలో నాయకులు సుధాకర్‌రెడ్డి, శాంతికుమార్, సతీశ్, సుగుణ, రామ్‌చందర్, శ్రీనివాస్, ఆసిఫ్ పాషా, సమ్మిరెడ్డి, సోతుకు ప్రవీణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.